న్యూజెర్సీ కథల పోటీలో రూ. 1000/-ల

బహుమతి పొందిన కథ

# అడవిలో వెన్నెల

- పొన్నాడ సత్యప్రకాశరావు



"ఆ! నా కెందుకులే అంత మంచి చీర... నేనేమైనా ఉద్యోగాలు చెయ్యాలా? ఊళ్ళేలాలా?"

వరండాలో నుంచి మరదలు దుర్గ గొంతు విన బడటంతో చదువుతున్న పుస్తకంలోంచి క్రీగంటితో చూసింది మమత. ఇరుగు పొరుగుతో కలసి ఇన్‌స్టాల్‌మెంట్‌లో చీరలు అమ్మే సుబ్బలక్ష్మి దగ్గర చీరలు సెలెక్ట్ చేసుకొంటోంది దుర్గ.

"పైగా నే నే చీర కట్టుకొన్నా ఆయన పట్టించుకోరు. పట్టించుకోడానికి పొగడడానికి నా కెవరూ మగస్నేహితులు లేరు" దుర్గ గొంతుకి ఈసారి ముసిముసి నవ్వులు తోడయ్యాయి.

వాళ్ళందరి టార్గెటూ తనేనని తెలుసు మమతకి.

"ఈ మధ్య ఇలాంటి మాటలు ఎక్కువగా వినిపిస్తున్నాయి... తన పట్ల, తన తల్లి పట్ల చాలా అనుచితంగా ప్రవర్తిస్తోంది దుర్గ. తమ్ముడితో చెప్పినా లాభం లేదు. వాడో గంగిరెద్దు... ఎవరో ఒకళ్ళు సర్దుకుపోవాలంటాడు... ఆవిడ ఎప్పుడూ సర్దుకుపోదు. తమ పొడ అసలు గిట్టడం లేదు. ఏం చెయ్యాలి? పోనీ తననీ, తల్లినీ పోషిస్తున్నారా? అంటే అదీ లేదు. తను ఉద్యోగం చేసుకుంటూ నెలకు నాలుగు వేలు తెచ్చుకొంటోంది. అమ్మకు పెన్షన్ వస్తోంది. నిజానికి తమ్ముడి జీతం వారిద్దరికీ, పిల్లలకీ చాలదు. తనకి మాత్రం ఎవరున్నారనుకుని తన సంపాదనంతా వాళ్ళకే ఖర్చుపెడు తోంది. పిల్లలని తన పిల్లలలాగే పెంచుతోంది. అయినా తమ ఉనికిని భరించలేకపోతోంది. ఎందుకో!?" మమత ఆలోచనలు గతంలోకి పరిగెట్టాయి.

--- --- ---

తండ్రి యాక్సిడెంట్‌లో చనిపోయినప్పటికి మమత ఇంటర్ ఫస్ట్ ఇయర్, ఆమె తమ్ముడు ఫోర్తు క్లాసులోను వున్నారు. మమత తల్లికి చదువు రాదు. వంట మనిషిగా పనిచేసి, బట్టలు కుట్టి పిల్లలను చదివించింది కాంతమ్మ... మమత మేనమామలు కొంత సాయం చేశారు. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించేసరికి మమతకి పాతికేళ్ళు నిండిపోయాయి. పెళ్ళి చేసుకొని తను వెళ్ళి పోవచ్చు. కాని తమ్ముడి చదువు పూర్తికాలేదు... అందుకోసం మొద టిసారిగా పెళ్ళిని వాయిదా వేసింది మమత. అయితే ఆమె తమ్ముడు డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగంలో అడుగుపెట్టగానే ప్రేమలో పడ్డాడు... తల్లి చివాట్లు పెట్టింది అక్కకి పెళ్ళికాకుండా చేసుకుంటావా అంటూ...

తమ్ముడి బాధ చూడలేక తనే దగ్గరుండి అతని పెళ్ళి చేయించింది మమత... అప్పటికి ఆమెకి ముప్పై నిండిపోయాయి.

అంతకు ముందే పరిచయమయ్యాడు వసంత్. తన మనసులోని మాటను చాలా సూటిగా అడిగాడు. మమతే కాదంది.

"ఇది సినిమా కాదండీ అభినవ సంధ్యగారూ! జీవితం... మీ త్యాగం అర్థంలేనిది... పనికిరానిది... 'నేను త్యాగం చేసాను' అని చెప్పుకోవాలన్న తపనే నాకు ఎక్కువగా కనిపిస్తోంది... మీరు చేస్తున్న దానికన్నా. తల్లి, తమ్ముళ్ళ బాధ్యతలు వదిలెయ్యమని నేను చెప్పను. మీ జీవితాన్ని చక్కపెట్టుకోవాల్సిన బాధ్యత కూడా మీ మీదే వుందని మర్చిపోవద్దు. రెంటినీ నిర్వహించండి... మీకు అభ్యంతరం లేకపోతే... నేను... మిమ్మల్ని... పెళ్లి చేసుకుందామనుకొం టున్నాను" నిజంగా చాలా సూటిగా అడిగాడు వసంత్. అతను ప్రాక్టికల్ మనిషి.. అతని మాటలు మమత అహాన్ని తృప్తిపరచలేకపోయాయి.

"తన త్యాగాన్ని అతను గుర్తించటం లేదు... అతనికి పెళ్ళి చెయ్యాల్సిన చెల్లెళ్ళు, చదువుకొంటున్న తమ్ముడు వున్నారు. తనూ సంపాదిస్తోంది. తనని

పెళ్ళి చేసుకుంటే తన సాయంతో అతని బాధ్యతలు సులువుగా తీర్చు కోవచ్చుననుకుంటున్నాడా?" ఇలా ఆలోచించిన మమత "పెళ్ళికి నాకు అభ్యంతరం లేదు... ఒక్క షరతు. నా తల్లి, తమ్ముళ్ళ బాధ్యతను మీరు కూడా వహించాలి" అని అడిగేసింది.

"డెఫినెట్లీ! మీ తమ్ముడికి ఉద్యోగం వచ్చేదాకా మన దగ్గరే వుండొచ్చు."

"ఉహు! అలా కాదు... మా అమ్మ నన్ను ఎంతో కష్టపడి చదివించింది. ఆమె నా దగ్గరే వుండాలి"

"మీ తమ్ముడిని కూడా పెంచిందిగా. అతనికి బాధ్యత లేదా... పైగా తల్లి బాధ్యత తనయుడిదే. అయినా మనం వీలయినంత సహాయం చేస్తూనే వుందాం."

"అలా కాదు... రేప్పొద్దున్న వాడి పెళ్ళాం అమ్మను సరిగ్గా చూడకపోతే... అందుకని అమ్మ నా దగ్గరే వుండాలి..." మమత మంకుపట్టు అంతగా నచ్చలేదు వసంత్‌కి. వసంత్ మమతని మనస్ఫూర్తిగా ప్రేమించిన మాట నిజమే. అతను అంతగా స్థితిమంతుడు కాకపోవటంతో అందరిలాగే ఎంప్లాయిస్ గర్ల్‌నే చేసుకోవాలనే ఉద్దేశంతో వున్నాడు... తన ఒక్క జీతంతో అతని బాధ్యతలు నెరవేర్చలేడని అతనికి తెలుసు... అయితే భార్య సంపాదన మీద పూర్తి హక్కులు కావాలని ఆమె వాళ్ళకి ఎటువంటి సహాయం చెయ్యకూడదని ఆంక్షలు పెట్టేటంత సంకుచిత మనస్కుడు కాదు. అతని తల్లిదండ్రులు కట్నం ఆశిస్తున్నా కట్నం తీసుకోకుండా మమతని పెళ్ళి చేసుకోడానికి ఇంట్లో వాళ్ళని ఒప్పించాడు... కానీ మమత తల్లి పెర్మనెంట్‌గా వాళ్ళ దగ్గర వుండటానికి అతని తల్లి ఒప్పుకోలేదు... ఆవిడ ఓ యావరేజ్ అత్తగారిలాగే మాట్లాడింది. పరోక్షంగా సహాయం చెయ్యడానికి వసంత్ సిద్ధపడినా మమత సుముఖంగా లేదు... అతను ఎంతో నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు... కానీ మమత చాలా మూర్ఖంగా ప్రవర్తించి అతని మనసుని గాయపరచింది... అతని పెళ్ళి వేరెవరితోనో... ఆఫ్‌కోర్స్, ఎంప్లాయిస్ గర్ల్‌తోనే జరిగిపోయింది.

త్యాగ గుణం మంచిదే కానీ "త్యాగం చేస్తున్నాను" అనే భావం ఓ పెద్ద మేనియా. వాళ్ళు నార్మల్‌గా ప్రవర్తిస్తే బాగానే వుంటారు కానీ... దానికి 'గుర్తింపు' కోసం 'తగిన ప్రతిఫలం కోసం ఎక్కువగా ఆశించి అసంతృప్తికి గురి అవుతారు... మొండిగా తయారవుతారు...మోడుగా మిగిలిపోతారు.

మమత విషయంలో జరిగింది అదే. ఆమె ఉద్దేశం మంచిదే అయినా ప్రాక్టికల్‌గా ఆలోచించి వుంటే ఆమె జీవితం హాయిగానే వుండేది. ఒక్కోసారి 'యాక్సెప్టెన్స్" అవసరం అవుతుంది. పరిస్థితులని 'అంగీకరించాలి'. దానిని 'ఓటమి'గా తీసుకోకూడదు...

మమతకి నలభై వసంతాలు గడచిపోయాయి... తమ్ముడికి ఇద్దరు పిల్లలు... బాబు... పాప... ఇద్దరూ ఆమె దగ్గర బాగా చేరికయ్యారు. ఆమె సంపాదనంతా వాళ్ళకే ఖర్చు పెడుతుంది. అయినా మరదలు దుర్గకి అత్తగారన్నా, ఆడపడచన్నా అస్సలు పడదు... పెళ్ళిచేసుకున్న తమ్ముడు ఆమె సంగతీ ఆమె పెళ్ళి సంగతీ ఎప్పుడో మర్చిపోయాడు... తల్లే అప్పుడప్పుడు పోరుతూ వుంటుంది. ఇరుగు పొరుగుకి సంబంధాలేమైనా వుంటే చెప్పమని అడుగుతూ వుంటుంది. రాను రానూ ఆ విషయం పట్ల ఉదాసీనత, నిర్లిప్తత ఏర్పడ్డాయి. "ముట్లుడిగే వయసులో పెళ్ళేమిటి" అని ఎంతో దారుణంగా దుర్గ ప్రక్కవాళ్ళతో అనడం మమత వినకపోలేదు... వసంత్‌లా మరి ఎవరూ ఆమెకి చేరువ కాలేదు. వసంత్ ఎంతో మంచివాడు. తను మూర్ఖంగా ఆలోచించి పోగొట్టుకొన్నదేమిటో ఆమెకి అర్థమయ్యేసరికి అన్నీ చేజారిపోయాయి. ఆలోచిస్తే వసంత్ చెప్పినదే నిజమనిపిస్తోంది. తన సంపాదన తిని తనని అసహ్యించుకొంటున్నారు... బాధ్యతగల కొడుకే తల్లిని తోబుట్టువుని చీదరించుకొంటూ వుంటే వసంత్ తల్లి తమని ఎలా చూస్తుంది? ఎలా చూసినా కనీసం వసంత్ ప్రేమ అయినా దక్కేది... ఇప్పుడు 'రెంటికి చెడిన రేవడు'లా అయింది తన పరిస్థితి. పైగా ఒంటరి ఆడదంటె అందరికీ చులకన. ఆఫీసులో బాస్ దగ్గరనుంచి ఫ్యూన్ వరకు "అడవి కాచిన వెన్నెల" అనుకొంటూ తెగ బాధ పడిపోతూ వుంటారు, రాస్కెల్స్. ఒకరిద్దరు మంచివాళ్ళు లేకపోలేదు. నిస్వార్థంగా సాయపడేవాళ్ళు తక్కువే... ఉన్న ఆ ఒకరిద్దరు "మంచివాళ్ళు" ఎప్పుడైనా ఏదైనా సాయం చేస్తే "మగ స్నేహితులు" అంటూ దుర్గ దెప్పుతూనే వుంటుంది."

"ఆంటీ" అంటూ స్కూలు నించి వచ్చిన పిల్లలు మీదపడటంతో ఆలోచనల్లోంచి తేరుకుంది మమత.. . ఆ పిల్లలతో ఆడుకొని అన్నీ మర్చిపోతున్న సమయంలో ఆమెకి వచ్చింది ఓ ఆలోచన.

***


వారం తిరక్కుండా వేరే అద్దె ఇల్లు చూసుకొని తల్లితో కలసి వెళ్ళిపోయింది మమత. అంత ధైర్యం చేస్తుందని అనుకోని దుర్గకు మింగుడు పడలేదు. వంట పని అత్తగారు, పిల్లల ఆలనా పాలనా ఆడపడుచు చూస్తూ వుండడంతో కొవ్వెక్కిన దుర్గకు ఇల్లు, పనులు నడపడం కష్టమయింది. మమత ఎవరినైనా 'దత్తత' తీసుకుందామనే ఆలోచనలో వుంది అని వినేసరికి తన పిల్లలలో నెవరినైనా తీసుకొంటే బాగుంటుంది... ఆమె ఆస్తి కలిసొస్తుందని ఆశ పడింది. చూచాయగా కబురు పెట్టింది కూడా. కాని ఎప్పుడైతే అనాథ శరణాలయం నుంచి ఓ ఆరు నెలల పాపను తెచ్చి పెంచుకుంటోందన్న విషయం వినబడేసరికి బిత్తరపోయింది. ఎవరో మగ స్నేహితుడు "పుణ్యం" కట్టుకొని వుంటాడని అవాకులు చవాకులు ప్రేలటం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది. ఆర్థిక చిక్కుల్లో పడిన మొగుడి తిట్లే మిగిలాయి దుర్గకి.

***

నా యవ్వనం అడవికాచిన వెన్నెల అయిందేమో కాని నా జీవితం కాదు... కాకూడదు అనుకొన్న మమత అనాథ శరణాలయం నుంచి ఎంతో ధైర్యంగా ఆరు నెలల ఆడపిల్లను తెచ్చుకొని "వెన్నెల" అని పేరు పెట్టుకొంది.

ఆ అడవిలో వెన్నెల విరగకాసింది.

## సామాన్లు



"ఏంటి సార్? ఇవాళ ఆఫీసుకి డ్రెస్ వేసుకు రాకుండా గ్లాసులు, కంచాలు కట్టుకొచ్చారు?" అడిగాడు వంశీ.

"ఏం చెయ్యమంటావయ్యా, మా ఆవిడ నాకున్న బట్టలన్నీ స్టీలు సామాన్ల వాడికి వేసేసి ఇవి తీసుకుంది!" ధుమధుమలాడుతూ అన్నాడు ఆఫీసర్.

– పి.వి. మురళీకృష్ణ

## తండ్రి పేరుతో పిలవబడుతున్న తనయుడు

కీ.శే. శశాంక చక్కని కవి. అతని కుమారుడు ఓలేటి పార్వతీశం. దూరదర్శన్‌లో వ్యాఖ్యానాల కోకిలగా వ్యాపించినవాడు. సాహితీ సమావేశాలలో శశాంక సమకాలికులు పార్వతీశం కనిపిస్తే శశాంక అని పిలుస్తారు. తండ్రిని తలపించే గొప్పదనం వున్నందువల్లే అలా అంటారని సారస్వత ప్రియులు ఆనందపడుతుంటారు. – జి. శ్రీశైలం

